# ముకుళించిన దానవత్వంలో వికసించిన మానవత్వం

టి. గౌరీశంకర్ & ఎన్. ఆర్. శేషుబాబు




'మాధవీ' సాయం కళాశాల అప్పుడే వదిలారు. సన్నగా కురుస్తున్న వానజల్లు ఆగిపోయింది. విద్యార్థులు, విద్యార్థినులు అంతా గుంపులు గుంపులుగా బయటకు వచ్చారు. అక్కడక్కడ నియోన్ లైట్స్ బారులు తీర్చి దారిని చూపుతున్నాయి. ఏదో జ్ఞానాన్ని సంపాదించాలనే ఆశతో కొందరు. ఏదో విధంగా మెట్లు దొర్లిస్తూ డిగ్రీలు పొందాలనే ఆకాంక్షతో కొందరు, వివిధ వైద్యాల విద్యార్థులతో నిండిపోయిందా కాలేజీ ఆవరణ ఈలలు వేస్తూ, గోలచేస్తూ అమ్మాయిల ననుసరిస్తున్నారు కొందరు. గ్రంథశాంగులు, ఎదుటి హృదయాలను కవ్విస్తూ కదులుతున్నారు కొందరు కన్నెపిల్లలు.

ఆ కోలాహలంలో ఒక అమ్మాయి ఒంటరిగా వస్తోంది. ఎవరితోను తనకు నిమిత్తంలేనట్టుంది. ముఖం కాస్త వడలిపోయింది. అయినా అందంగానే కనబడుతోంది; పొడవైన వాల్జడలోని సన్నజాజుల పరిమళం గుబాళిస్తోంది. ఫాలభాగంమీది ముంగురులు మందంగా వీస్తున్న పవన వీచికలకు అందంగా కదులుతున్నాయ్; విశాలమైన వెన్నెలవంటి తెల్లని కళ్ళ అంచులకు కటిక చీకటి లాటి కాటుక వత్తుగా పట్టించింది. ఆరంజ్ కలర్ అంచు గల తెల్లనూలుచీర పైట నిండుగా కప్పుకొని కాలేజీ ఆవరణ నుండి బయట పడింది.

అడుగులో అడుగు వేస్తూ బస్‌స్టాప్ వద్దకు వచ్చి నిలబడింది. రోడ్డంతా తడి ఆరి అద్దంలా మెరుస్తోంది. పౌర్ణమి కాబోలు. చెవులు చిల్లులుపడేలా కారుబ్రేక్లు కీచుమన్నాయ్. తలెత్తి చూసింది. ఎదురుగా ద్వారకహోటల్ నుండి ఒక ప్లిమత్ కారు స్పీడుగా వస్తుంటే ఎదురుగా ఒక గుడ్డి అమ్మాయి కారు క్రిందకు వచ్చింది. అదృష్టవశాత్తు ఆ కారులోని వ్యక్తి మెలకువ పాటు వలన ఆ కారు బ్రేక్లు కీచుమనడం, ప్రమాదం తప్పడం జరిగింది. తరువాత కారు వెళ్ళిపోయింది.

బస్ ఇంకారాలేదు. ఆమెలో ఏదో ఆరాటం, ఆతృత, దిగులు, కంగారు కనబడు తున్నాయ్: "ఇంట్లో అమ్మ ఎలావుందో కనీసం మందిచ్చే వారుకూడ లేరు. అమ్మా మంచం దిగలేదు ఎలా వుందో ఏమో" అని బెంబేలు పడసాగింది. అంతలో "ఉమా" అన్నపిలుపుతో వులిక్కిపడి తలెత్తి చూసింది. ఆ వ్యక్తి ఎదురుగా మోటార్ సైకిల్ పై కూర్చొని రెండు చేతులు చంకల క్రిందుంచుకొని చిరుమందహాసంతో తదేకంగా తన్ను పరిశీలిస్తున్నాడు.

"ఓ... మీరా!" అంది మర్యాదగా

"అవును... బస్ కోసమా"

"అవును"

"ఈ బస్సులింతే. యువతుల వ్యక్తులు తన కోసం తపస్సు చేస్తున్నారని ఏమాత్రం గ్రహించవ్!... పద ఇంటికెళదాం" అన్నాడు అప్పుడిలా.

"పర్వాలేదు... అదిగోబస్ వస్తూంది" అంది.

"లేదు లేదు. నేను దిగబెడతాను, పద... ప్లీజ్" అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో.

"నో థ్యాంక్స్, బస్‌లోనే వెళతాను"

"నో నో నో... మీరు రావాలి" అంటూ మోటార్ సైకిల్‌దిగి స్టాండ్‌వేసి దగ్గరకొచ్చాడు. ఉమకు భయమేసింది. దూరంగా జరిగి బెదురుగా చుట్టూ కలియ జూసింది అది గ్రహించాడావ్యక్తి.

"భయపడుతున్నావా... ఆ భయమే పనక్కరలేదు. నేనున్నానుగా... పద" అన్నాడు అధికారంగా.

"లేదండి. నేను బస్‌లోనే వెళ్తాను." అంది దిక్కుదోచక.

"ఉమా, నా కళ్ళల్లోకి చూసి చెప్పు, నన్ను శంకిస్తున్నావా" అన్నాడు, తూలబోయి సంబాళించుకుంటూ.

ఉమ అతని కళ్ళల్లోకి చూసింది. కళ్ళు చింత నిప్పుల్లా ఎర్రగా మండుతున్నాయి.

స్నిగ్ధ గంభీరమైన అతని ముఖంలో ఏదో గాఢాంధకారమలుముకుంది. ఆ ముఖం చూడలేక చూపు దించుకొని "అబ్బే... అదేంలేదు" మాట పూర్తికాక ముందే.

"మరెందుకోసంకోపం !" అంటూ మరీ దగ్గర కొచ్చాడు.

గుప్పుమని ఏదో వాసన వచ్చింది. ఉమకు ముక్కుపుటాలు బిగిశాయ్. ఏమిటీ బలవంతం... ఎలా వదిలించుకోవాలి. వదిలేట్టులేదు. వెళ్ళడమా మానడమా, అన్న సందిగ్ధంలో పడిపోయింది. చివరకేమి నిర్ణయించుకుందో 'పదండి' అంది. ఫలించుకొని. అమితోత్సాహంతో మోటార్ సైకిల్ స్టార్ట్ చేశాడతను.

టాంక్ బండ్ మీది నుండి శరగవేగంతో పోతోంది మోటార్ సైకిల్. అంత కంటే వేగంగా కొట్టుకుంటూంది ఉమ గుండె. శరదృతు గాలులు చల్లగా వీస్తున్నాయి. అంతా నిర్మానుష్యంగా వుంది. మనిషి బాగా మత్తుగా ఉండటం వల్ల యెదురుగా యేమీ కనిపించటంలేదు. ఫుల్ స్పీడ్‌లో వున్నందువల్ల మెత్తనుండి పైకెగిరింది. ఉమ పంచప్రాణాలు ఒక్కసారి పైకెగిరి ఒడిలో పడి నట్లనిపించింది.

"ఉమా, నా నడుం పట్టుకో" అన్నాడు చనువుగా.

"ఎందుకు" అంది అనుమానస్పదంగా.

"పడిపోతావని"

"నేనంత తెలివిగా పడను" అంది కండవగుల గొట్టినట్టు. వ్యంగ్యంగా నవ్వుతూ. "కాలుజారిన తరువాత కూడా పడకుండా యెలా వుంటావు." అన్నాడు సగర్వంగా.

దానికేం సమాధానం చెప్పాలో తెల్సికూడా చెప్పలేక మౌనంగా వుండిపోయింది. తర్కం పెరుగుతుందని.

కొన్ని క్షణాలు మౌనం. టాంక్ బండ్ ప్రక్కనున్న గార్డెన్ వద్ద మోటార్ సైకిల్ ఆపుచేశాడా వ్యక్తి.

"ఏమిటి ? ఇక్కడాపారే ?" అంది కంగారుగా.

"ఏమీలేదు కాస్త చల్లగాలి పీల్చిపోదామని" ... అంటూ దిగాడు

ఉమను ఏదో అనుమానం వెనక్కిలాగుతోంది కానీ, అవమానమైన నమ్మకం ముందుకు నెట్టుతోంది. కాళ్ళు కూడ తనకు తెలికుండానే చకచకా పోతున్నాయి. అతన్ననుసరిస్తూ.

ఆ వ్యక్తి తూలుతూ పచ్చని గడ్డిలో కూర్చుంటూ "ఉమా, రేపటినుండి ఉద్యోగం మానేయ్" అన్నాడు.

"ఎందుకు"

"మీ కుటుంబ భారమంతా నేను మోస్తాను. ఇక నువ్వు నిశ్చింతగా ఇంట్లోనే కూర్చో" అన్నాడు, ఆప్యాయతను ఒలకబోస్తూ, సిగరెట్ పొగ గాలిలోకి వదులుతూ.

"ఇప్పటికే ఎంతో ఋణపడి వున్నాం. ఆ ఋణమెలా తీర్చుకుంటామోనని బాధ పడుతున్నాం."

"ఋణం తీర్చుకుంటావా, అయితే ఇప్పుడే తీర్చుకోవచ్చు" అన్నాడు వెర్రిగా.

"ఎలా ?" అంది బేలగా.

"ఇలా" అంటూ కౌగలించుకున్నాడు.

ఉమలో కోపం కట్టలు త్రెంచుకుంది. తోక త్రొక్కిన త్రాచులా బుస కొట్టింది. "రావుగారూ ఏమిటి మీరు చేస్తున్నది. ఇంత తుచ్ఛానికి దిగజారతారని నేనూహించలేదు." అంది కోపం అణచుకొంటూ.

రావుకా మాటలేమీ వినిపించడంలేదు. ఉమను తాకగానే అతనిలో వుద్రేకం వుప్పొంగింది. నరనరాల్లో తమకం పరవళ్ళుత్రొక్కుతూంది, మెడకు చుట్టుకున్న స్కార్ఫ్‌ను విసరడీస్తూ "కోపంలో కూడ కొందరాడవాళ్ళు అందంగానే వుంటారు. ఆ కొందరిలో నీవొకతెవు" అంటూ దగ్గరగా వచ్చి "ఉమా, నీ అందాన్ని చూస్తుంటే నాలో యవ్వనోద్రేకం పురకలు వేస్తుంది. యిన్నాళ్ళూ ఈ క్షణం కోసమే ఎదురు చూశాను" మత్తుగా అన్నాడు.

ఉమకు గుండె వేగం ఎక్కువైంది. శరీరమంతా భయంతో కంపిస్తోంది. ఈ ఘోర ప్రమాదం ఎలా తప్పుతుందా అని తపనపడుతోంది.

"రావుగారూ, అన్నం పున్నం ఎరుగని కన్నెపిల్లల్ని ఇలా నమ్మించి వెన్నుపోటు పొడవటం మీకు న్యాయమా ?"

"న్యాయాన్యాయాలు ఇక్కడ కాదు. న్యాయస్థానంలో"

"హుఁ న్యాయస్థానం, అసలు న్యాయానికి స్థానముంటేనా న్యాయస్థాన ముండటానికి"

"అధిక ప్రసంగం కట్టిపెట్టు"

"ఆపదల్లో వున్న మా కుటుంబాన్ని ఆదుకొని ఒడ్డుకి చేర్చారు. ఆరిపోతున్న మాఇంటి దీపాన్ని చమురుపోసి వెలిగింప జేశారు. దానికి మీరు ఆశించిన ప్రతిఫల మిదా ? వద్దు... మీకు పుణ్యముంటుంది, నా బ్రతుకు బండలు చేయకండి." అంది బ్రతిమాలుతున్న ధోరణిలో.

"హుఁ ... నీతిసూత్రాలెందుకుగాని, మధుర క్షణాలు వృధా చేయక మర్యాదగా రా." అంటూ ఆమె భుజాలు పట్టుకొని ముఖంపై ముఖం చేర్చబోయాడు. వేటగాని చేతిలో చిక్కిన నెమలిలా విల విల కొట్టుకొంది, గింజుకుంది.

"వొదులు, నన్నొదులు. అరుస్తాను. గట్టిగా అరుస్తాను." అంటూ ఆక్రోశించింది ఉమ. కానీ లాభం లేకపోయింది. రావులో పశుత్వం విజృంభించింది. ఇక ఉమలో సహనం నశించింది. గత్యంతరంలేక గట్టిగా అతని చెయ్యి కొరికి, దూరంగా పరుగెత్తింది. దగ్గరగా రాబోతున్న రావుతో, ప్రక్కనేవున్న సాగర్ లోకి చూస్తూ.

"దౌర్భాగ్యుడా, ఆగు ! దూరంగా వుండు. దగ్గరకు రాకు ... పడిపోతాను. నీటిలో పడిపోతాను ... దూకుతున్నాను." అంటూ గర్జించింది.

రావు స్థాణువులా నిలబడిపోయాడు. చలనం లేని శిలాప్రతిమలా నిలబడిపోయాడు. చలనం లేని శిలాప్రతిమలా మారిపోయాడు. అతని ముఖంలో రంగులు మారసాగాయి. కళ్ళలో క్రౌర్యం రూపుమాసి కన్నీరు సుడులు తిరగ సాగింది. ఒళ్ళంతా చెమటలు పట్టి కామజ్వాల చల్లారింది. అతనిలోని అజ్ఞానం తెల్లారింది.

స్మృతి పథంలో గతం మెదిలింది.

రావు లక్షాధికారి. అందగాడు. పైగా విదేశాల కెళ్ళి చదువుకున్నాడు. అతనికి 'నా' అనేవారెవ్వరూ లేరు. అతనొక అమ్మాయిని ప్రేమించాడు. కానీ ఆ అమ్మాయి అతన్ని దగా చేసి పోయింది. దాంతో అతని హృదయం దెబ్బ తింది.

స్త్రీ అంతా ఇంతే అనుకున్నాడు. అనాటి నుండే అతనికి ఆడదానిపై అసహ్యం. ద్వేషం, పగ, ప్రతీకారం జనించాయ్. ఆడదంటే ఒక పువ్వు అనుకున్నాడు. తన దృష్టిలో పడ్డ ప్రతి ఆడదాన్ని పువ్వులా నలిపి పారేశాడు. ప్రతీకారం తీర్చుకుంటున్నందుకు సంతోషించేవాడేగాని ఆ పగ ఎంతమంది కన్నెపిల్లల్ని బలిగొంటుందో తెలుసుకోలేకపోయాడు.

ఒక రోజు "హోటల్ మెరీనా" నుండి వస్తూ దారిలో నాంపల్లి స్టేషన్ దగ్గిర విధిచే తరుమబడుతూ వచ్చిన ఒక దురదృష్టవంతురాల్ని చూశాడు. రోడంతా నిర్మానుష్యంగా వుంది. రావు కళ్ళు ఆ అమ్మాయిపై బడ్డాయి. దగ్గరగా వెళ్ళి,

"ఎవరమ్మా, అర్ధరాత్రివేళ్ళ యిలా వంటరిగా నిలబడ్డావు" అని అడిగాడు.

"దురదృష్టవంతురాల్ని" అని అంది విరక్తిగా

"నీ మాటలు వింటుంటే జీవితంపై విసిగిపోయినట్టుంది." యెందుకిలా జరిగింది?"

"నా పేరు కుసుమ. బి. ఏ. పాసయ్యాను. నాకు నా అనే వాళ్ళెవ్వరూ లేరు, వున్నవాళ్ళంతా మొన్నటి వరదల్లో పోయారు." అంటూ కంటి నీరు పెట్టింది.

"ఛ ఛ, యేడుస్తున్నావా, పిచ్చిపిల్ల ఏడవకు నేనున్నానుగా, మా కంపెనీలో రేపే ఉద్యోగ మిప్పిస్తాను. నాన్నెవ్వ, ఉద్యోగమేమిటి నాఆనందం నీతో పంచుకుంటాను" అన్నాడు,

ఆ మాటల్లోని అంతరార్థంగాక "నాపాలిటమీరు దేవుడిలాప్రత్యక్షమయ్యారు. ఈ ఋణమెలాతీర్చుకుంటానో" అంది. జీవితంలో ఎత్తుపల్లాలు తెలియని కుసుమ కృతజ్ఞతా పూర్వకంగా.

[illegible] టాంక్ బండ్ రోడ్డుమీదనుంచి ఫుల్ స్పీడులో పోతూంది కొంచెం సేపట్లో ప్రక్కనే వున్న గార్డెన్ దగ్గర కారాపాడు. అమాయకురాలైన కుసుమ అనుసరించింది.

హఠాత్తుగా మబ్బుల్లేని పిడుగులా పట్టేసు కున్నాడు రావు, కుసుమను. అతని హస్తాల్లో గింజుకుపోయి గిల గిల కొట్టుకుంది కుసుమ. తప్పించుకోడానికి అతని చేయి కొరికి దూరంగా

పరుగెత్తింది. కానీ రావు తన ప్రయత్నం విడువక ఆ అమ్మాయిని అనుసరించాడు. కుసుమకు ఏం చేయాలో పాలుపోలేదు ప్రక్కనే వున్న పిట్టగోడ కానుకొని గట్టిగా అరిచింది.

"దౌర్భాగ్యుడా, ఆగు, దూరంగా వుండు," దగ్గరకురికాడు. రాకు. పడిపోతున్నాను... నీటిలో పడిపోతున్నాను... నీటిలో పడిపోతున్నాను, ఆలోచించుకో రేపీపాటికి నీపై హత్యానేరం పడుతుంది. రాకు...రాకు" అంటూ పిచ్చిగా అరుస్తోంది రావు వినకుండా దగ్గరకి సమీపించాడు. మరుక్షణంలో హుసేన్ సాగర్ జల గర్భంలో కలిసి పోయింది కుసుమ...

ఒకరోజు వీధిలో పడి ఏడుస్తున్న ఒక స్త్రీని, ఆమెను ఓదారుస్తున్న ఓ అమ్మాయిని చూశాడు. వారి విషాద గాథ విన్నాడు, చేరదీశాడు. ఆదరించాడు. ఆ అమ్మాయికున్న అర్హతను బట్టి తగిన ఉద్యోగమిచ్చాడు. వారి కాళ్ళపై వారు నిలబడేటట్టుగా చేశాడు. ఆ అమ్మాయి ఉమ. తండ్రి లేని పిల్ల. తల్లి రోగి రావు ప్రసాదించిన ఉద్యోగంతో తల్లిని పోషిస్తూంది.

ఉమను రావు ఏనాడు చెడ్డ దృష్టితో చూడలేదు. కాని, ఈ రోజు అతన్ని ఆవరించిన మైకం ఆమె అందాన్ని చూసి ఊపిరాడనివ్వలేదు. మరుగు పడిన మదుడు తిరిగి బాణం విసిరాడు. తాపం ఆపుకోలేక ఈ పిచానికి పాల్పడ్డాడు.

ఉమ పిట్టగోడ కానుకుని అరుస్తుంటే ఆ నాటి సంఘటన కళ్ళముందు తిరిగింది. పిచం సిరు కారిపోయింది. అజ్ఞానాంధకారం పటాపంచలై, చీకటి రేఖలు చీలిపోయి అతని హృదయంలో వెలుగు కిరణాలు ఉదయించాయి.

తన దుష్ప్రవర్తనకు ఉమ ఏం అఘాయిత్యం చేస్తుందోనని రావు గుండె దడదడ కొట్టుకుంటోంది. రావు అడుగు ముందుకు వేశాడు. ఉమ అలాగే అరుస్తోంది. ఆమె అతనిలోని మార్పును తెలుసుకోలేక అరుస్తూ ప్రక్కనున్న నీటిలో దూకబోయింది. రావు ఒక్క అంగలో ఉమను చేరుకొని చేయిపట్టి బలంగా ఇవతలకు లాగి ఆమె కాళ్ళపై కుప్పలా కూలిపోయాడు. ఉమ ప్రాప్పడి పోయింది.

"ఉమా, నా సీ చావుకి నన్ను చంపనైనా చెయ్యి విలువున పాతెయ్, నన్నేమి చేసినా నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు"... అంటూ తలను ఉమ కాళ్ళకేసి బాదుకోసాగాడు.

"పశ్చాత్తాపము కంటే మించిన ప్రాయశ్చిత్తం మరొకటి లేదు" అంది ఉమ జీవంలేని స్వరంలో జీవాన్ని పూరి పోసుకుంటూ.

"ఉమా, నన్ను క్షమించు. నీ సోలితనంతో నాలోని అంధకారం పటాపంచలైంది నన్ను మంచిదారిని నడిపించావ్. ఇక ఎప్పుడు ఇలాంటి పాపిష్టి పనులకు పాల్పడను. నీ పాదాలపై ప్రమాణంగా ఈ రోజు నుండి దుర్వ్యసనాలన్నీ మానుతాను." అంటూ పసిపిల్ల వాడిలా పిచ్చిగా ఏడ్చాడు.

"రావుగారూ, ఇంతవరకు దుష్టంగా ప్రవర్తించింది. మీరు కాదు. మీలోని దుర్బలత్వం దానికి లోనై లౌకిక జ్ఞానాన్ని విస్మరించారు. ప్రతి మానవుణ్ని ఈ దుర్బలత్వం ఏదో ఒక విధంగా వశపరచుకొని దానవుడిగా తయారు చేస్తోంది. ఆత్మస్థైర్యముతో దాన్ని జయించిన వాడే మనిషి మనిషిగా మారుతాడు. ఇప్పుడు మీలోని దుర్బలత్వం మిమ్మల్ని విడచి పారిపోయింది. ఇక మీరు అజేయులు మిమ్మల్ని క్షమించాల్సిన పనే లేదు. లేవండి" అంది గంభీరంగా కాని రావు మాత్రం కాళ్ళు విడువలేదు.

"మీరు పెద్దవారు, మీరు నా కళ్ళు పట్టుకోవడం భావ్యం కాదు... లెండి" అంది బుజ్జగించిన రీతిగా.


"పోని, ఒకసారి నన్ను మనసారా అన్నయ్యా అని పిలు" అని అర్థించాడు.

"అన్నయ్యా" అని ఆపిలుపులోని మాధుర్యం చవిచూసింది.

"చెల్లీ" అంటూ ఆ పదంలోని తియ్యదనాన్ని గ్రోలాడు.

"తప్పొప్పులందరూ చేస్తారు. కాని తమతప్పు అని తెలుసుకొని యింకెన్నడూ చేయకుండా వున్నప్పుడు మనిషిలోని మూఢత్వం ముకుళించి, మానవత్వం వికసిస్తుంది. అంటూ హితబోధ చేసింది.

★



# యువజనం

## —జొన్నలగడ్డ సుధాకర్

విచ్చుకత్తులను జోలుచు
చిచ్చర పిడుగుల రీతిగ
రెచ్చెడి ఆవేశంతో
వచ్చెడి ఆ యువతరాన్ని

ఆపగలుగు వారెవ్వరు ?
అడ్డగలుగు వారెవ్వరు ?

ఉప్పెన వలె లేచినారు
ఉప్పరాని కెరటగినారు
ముప్పులు కడ తేర్చగలరు
తప్పులు కడిగేయగలరు

ఆపగలుగు వారెవ్వరు ?
అడ్డగలుగు వారెవ్వరు ?

భావితరపు పౌరవరులు
భవితవ్యపుటధినేతలు
ప్రగతీ వృక్షపు ఫలములు
ప్రకృతి కుసుమించు పూలు

వీరి నెవ్వరాప గలరు ?
వీరి నెవ్వరడ్డ గలరు ?

నెల్లవ్వపు తొలిపంటలు
వెలుగొందే పెనుమంటలు
యువజనమ్ము లీ దేశపు
భవితకు మ్రోగే గంటలు

ఆపగలుగు వారెవ్వరు ?
అడ్డగలుగు వారెవ్వరు ?

వంచన పోద్రోలువారు
మంచికొరకు నిలుచువారు
మనిషికొరకు మమతకొరకు
మహినంతా మార్చువారు

యువజనమ్ములే కాదా ఈ మా
నవజనమ్ములే కాదా !